

# పిడుగు

చెన్నకేశవ



వసంతపేట వీధి బడి. అయ్యవారు నాల్గవ తరగతి పిల్లల చేత బెత్తంతో మధ్య మధ్యలో మందలిస్తూ, పాఠం వల్లెవేయిస్తూ వున్నాడు.

అందరిలాగా మునిరాముడు చదువుతున్నాడు. కాని, వాడికి 'దీపావళి పండుగ రోజు ఉదయముననే లేచెదరు. తలంటి స్నానము చేసెదరు. టపాకాయలు కాల్చెదరు. పెద్దలు, పిల్లలు కొత్త బట్టలు కట్టెదరు. పిండివంటలు చేసెదరు' అనే అయ్యవారి పాఠం బోధపడలేదు.

అందరి నోటితో తన నోరూ మెదుపుతున్నాడు. కాని, వాడికి మనసులో అమ్మ చెప్పిన మాటలే కదులుతున్నాయి–

"అబ్బి, రేసనుకారద్లు అన్నీ జమ సెయ్యరా. దీపాల పండక్కి కొత్త అంగీ పట్టిస్సా. పటాకాయలు కొనిస్సా."

మళ్ళీ మునిరాముడు ఆలోచిస్తున్నాడు.

' కొత్త అంగీ ములుపు సంకురేత్తిరికి పట్టిచ్చుకున్నా. అది నా లెక్కతోనే. రేసను బియ్యాలు ఇంటింటివీ మోసిన్నా. ఓబలేసు సూపరేజరింట్లో పని చేసిన్నా. అయిదు రూపాయిలు లెక్కచ్చిన్నాడు. అమ్మ గూడ లెక్కచ్చిన్నాది. అంతా కొండబోయి కొనుక్కున్నా. ఈ తూరికి ఎవ్వుర్నీ అడిగేదినేదు. ఇయ్యాల టోరు బియ్యాలు కొండబోయి ఇస్తినా, లెక్కలు దండిగా వస్సాయ్. పదికారద్లు సక్కెర, బియ్యాలు తెస్సా. మర్నాటికల్లా అంగీ, టపాకాయలూ దండిగా కొనుక్కుంటా."

"చదవరా, చదువు"అని అయ్యవారు గదుముతూనే వున్నాడు. గంట గణగణ మ్రోగింది.

పిల్లలు పలకా, పుస్తకాలు సర్దుకొని లేచారు. మునిరాముడు చిరిగిన చొక్కాతో, చీమిడిముక్కుతో పాత పుస్తకాలు, పలకా సర్దుకొని పరుగు తీశాడు. రొప్పుతూ ఐదునిముషాల్లో ఇంటిముందు వాలాడు.

మునిరాముడుండే ఇల్లు ఓ గుడిసె. దాన్నే కొట్టం అంటారు. ఆ పేటంతటికీ 'కొట్టాలు' అని పేరు. ఈ 'కొట్టాలుపేట' కాలేజీరోడ్డులో వుంది. ఒక మోస్తరుగా ఎత్తైన గోడలు, పైన బోదకప్పు, క్రింద నాపరాళ్లా, వెదురుతో చేసిన తలుపులు, ఇంటిముందు నాపరాళ్ల తోనే అరుగులు, ఆ కొట్టాలని చూస్తూనే కలిపిస్తాయి. ఆ పేటకంతా కలిపి మూడే మూడు పెంకుటిళ్లున్నాయి. సూపరేజరు పట్నం ఓబులేసూ, కాలేజీ సూపరింటెండెంటు కటకం గోవిందూ, అయ్యవారు తాటాకుల సుబ్బరాయుడూ.

ఆ పెంకుటిళ్ల యజమానులే ఆ పేటకి మధ్యతరగతి మహారాజులు. వాళ్ళిండ్లల్లో పనులకీ, చుట్టుపక్కల పొలం పనులకీ వెళ్ళేది ఈ కొట్టాల్లో వుండే పిల్లలూ, పెద్దలూ. ఆడవాళ్ళు పాచిపని చేసి సంపాదిస్తారు. మగవాళ్లు పొలం పనులకీ, ఫ్యాక్టరీల్లోకి వెళ్తారు. పిల్లలు స్టోరు బియ్యం, కిరసనాయిలు తెచ్చి డబ్బు చేసుకుంటారు. స్టోరు అవసరం లేనివాళ్లంటే, వాళ్ళవద్ద ఈ కొట్టాల ఆడవాండ్లు ఆ కార్డులు కొని, బియ్యం తెచ్చుకొని మారుబేరానికి అమ్ముకుంటారు. ఆ పేటలోనే కాదు, చుట్టుపక్కల పేటల్లోని కూడా సేకరించి ఈ వ్యాపారం చేయడం వారికి అలవాటు. క్యూలో నిల్చొని తెచ్చుకోలేని మధ్యతరగతి మాలక్ష్మమ్మలకి వీళ్ళు సాయం చేస్తారు. స్టోరు డీలరు తహసీల్దారుకీ, ఆర్టీవోకీ ముడుపు చెల్లించుకోవడం పరిపాటి. మొదటి తేదీన ఇవ్వాల్సిన కోటా పది రోజులాపి ఇవ్వడం లేదూ? రెండురోజులిచ్చి మిగిలింది స్వాహా చేస్తున్నారు కదా. పండగ కోటా ఎక్స్ట్రా వచ్చినా దాచుకొని మామూలు కోటానే ఇస్తున్నారు గదా. ఆఫీసరు వ్యాపారస్తుల్ని మింగాలనుకుంటాడు. వ్యాపారి ప్రజల్నీ, ప్రభుత్వాన్నీ మింగాలనుకుంటాడు. కాని పేటలోని ఆడవాళ్లు ఎవ్వర్నీ మింగలేరు గనుక తమ అందుబాటులో వున్న ఈ వ్యాపారం చేస్తారు. పంచదార కిలోకి యాభై గ్రాములు తగ్గినా, ఐదు లీటర్ల కిరోసినుకి నాలుగున్నర ఇచ్చినా కిమ్మనకుండా తీసుకుంటారు ప్రజలు. పెద్ద చేప చిన్నచేపను తింటుందన్న న్యాయం పదహారణాల

జరుగుతున్నదే.

ఈ కొట్టాలు పేటకి ఒకటే చౌకధరల దు కాణం. పండుగ ముందు రోజు గదా, రద్దీ ఎక్కువ. ఉదయం ఎనిమిది గంటల నుంచీ క్యూలో నించుండేవాళ్లూ, మనుషులు లేకుంటే వంతులకి రాళ్లూ, డబ్బాలూ పెట్టేవాళ్లూ ఒకటే సందడి. కొట్టాలపేట పిల్లలు ఒక్కొక్కరూ రెండేసి కార్డులు చేతిలో పట్టుకొని చూచున్నారు. ఈ క్యూలో మునిరాముడు వచ్చి నుంచో వాలి...


కొట్టం ముందు వెదురు తలుపు తొందరగా తీసి సంచీని విసిరి పడేశాడు. మళ్లీ తలుపు దగ్గరకేసి పరుగెత్తబోయాడు. ఈ అలికిడి విని ఆరుబయట నాపరాళ్లపై నులుక మంచంపై పడుకున్న ముసలోడు లేచాడు–

''ఏంబ్బీ, యిస్కూలు యిడిసిపెట్టినట్టుండాదే. ఏడపోతుండవు?'' ముసలోడు ప్రశ్నించాడు.

''టౌరుకు పోయ్యొస్సా. సూపరేజరుకి బియ్యాలు తేవాల'' మునిరాముడి సమాధానం.

'నిన్ను సదవేసేది ఇందుకంటరా అబ్బీ, ఇంటికాడ పుత్తకం సదవరాదంటరా?'

'నువ్ సదవనేదు... ఉద్దోగం నేదు. కూలికిపోయి లెక్కతెస్తివి. అయ్య సదివిన్నాడు. ట్రైకు చేసి సచ్చిపోయిండు. నాకు గుడ్డలు నేవు. అమ్మ ఎక్కడ తెస్పాది.




సూపరేజరింట్లో పనిసేత్తే యాభై రూపాయిలు లెక్కిస్సారు. కూటికి సాల్తయా? సెప్పు మరి?'

పిల్లవాడిలో ఇంత తర్కం ఎలా వచ్చిందీ అని ముసలోడు ఆశ్చర్యపోయాడు. సలహా ఇవ్వాలని ఇచ్చాడు గాని తనకు ఆ అధికారం ఎక్కడిది? కోడలు సంపాదించి పెడ్తే తిని పడివుండడమే తనపని. మనవణ్ని మంచి బడిలో వేసి చదివించలేదు. అందుకే మునిరాముడికి వీధి బడే శరణ్యం అయింది. ఒకటి రెండు దఫాలు తల్లితో తోడుగా మునిరాముణ్ని చౌక ధరల దుకాణానికి తనే వెళ్లమన్నాడు.

మొదటి దఫా తల్లి వాడికి బిస్కత్తు కొని పెట్టింది. రెండవసారి మాగుగుట్టా కొని పెట్టింది. దుకాణం నుండి తెచ్చే సరుకులు, బరువులు మరీ ఎక్కువ అనుకుంటే ఆరోజు మునిరాముణ్ని బడి మానిపించేది.

ఇంత కష్టపడినా గడవని సంసారం. పొద్దున్నే సద్ది. మధ్యాహ్నం జొన్న రొట్టా, బండకారం, సాయంత్రం గంజినీళ్ళు తప్ప దేనికీ నోచుకోలేదు. ఈ సంసారాన్ని ముసలాడుగా తనేం ఆదుకోలేదు. తన మనవణ్ని సూపరేజరు ఓబలేసు కొడుకులా, గోవిందు కూతురిలా, సుబ్బరాయుడి మనవడిలా ఎలా ఊహించుకోగలడు?

అప్పుడెప్పుడో తన కొడుకు వెంకట్రాముడు చనిపోయిన కొత్తల్లో కోడలు సుబ్బులత్తో ఓబలేసు సూపరేజరు ఇలా అన్నట్లు గుర్తుంది.

చిన్న పిల్లల్ని బడికి పంపకుండా పన్లు చేయించడం చట్ట విరుద్ధం. అదీ గాక పేదపిల్లలకి ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నది. కనుక చదివించి పెద్దవాళ్ళని చెయ్యాల్సిన బాధ్యత నుంది.


పతివాడ వెంకట సుధాకర్

19-11-1958 25-6-1979



అష్టమ వర్ధంతి

నీ జ్ఞాపకాల సుగంధం
నీ స్మృతి రగిల్చిన మంటలను
ఇన్నేళ్ళుగా చల్లబరుస్తూనే వుంది
నీ జ్ఞాపకాలను మోసుకుంటూ తిరుగుతున్న మాలో
నీవు చిరంజీవివై
స్మృతిరంగంలో వెలుగులు విరజిమ్ముతున్నావు

–అమ్మ, నాన్న
శేఖర్, రాధి

ADVT

కొంతమంది పెద్దల ఆశీస్సులతో జీవితాన్ని 'అద్దెయిల్లు'లా హాయిగా గడిపేస్తారు.
మరి కొంతమంది జీవితాన్ని స్వశక్తితో 'స్వంత ఇల్లు'లా నిర్మించుకుంటారు.
ఒక ఆడపిల్ల జీవితాన్ని ప్రేమపూరితమైన సంపూర్ణగృహంగా కావాలని కోరుకుంటే, ఆ సుకుమారికి ఎదురయ్యే కష్టనిష్ఠూరాలు, కోపతాపాలు, సూటిపోటీలు వీటికి అక్షర చిత్రీకరణ.
చదవండి!

యద్దనపూడి సులోచనా రాణి

క్వాజీ (QUASI) డైరెక్షనులు

సుకుమారి



వెల : రూ 25/-

జులై 1 విడుదల !

ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్,
3237, రాష్ట్రపతి రోడ్,
సికింద్రాబాద్–500 003

దానికి సుబ్బులు—

'సట్టాలు సూస్కుంటే పొట్టలు నిండతయా సామీ, ముండమోసిన ఆడకూతుర్ని. ఎనకా ముందూ ఎవురూ నేరు. సదవెయ్యాలంటే లెక్కలు గావాల. వాళ్లు ఒక పూట బువ్వ పెడ్తే సరిపోద్దా. అదీ ఉప్పుడు నేదు. పుస్తకాలు, గుడ్డలూ ఇస్తారంట. ఎన్నాళ్లు సదివేను? ఇంటిపని నేర్చకపోతే రేపు పెద్దోడు అయి లెక్క తెస్తాడని ఏం సెప్తావ్ అయా' అని గడగడా సమాధాన మిచ్చింది. ఇదంతా ఓసారి నెమరువేసికొని ముస లోడు ఖంగున దగ్గి తన నిస్సహాయతని తెలియపర్చాడు.

** ** **

ముసలోడు ముసుగుకప్పి పడుకున్నాడు. ముని రాముడు తలుపు దగ్గరేశాడు. పరుగులాంటి నడకతో సూపరేజరింటికి చేరాడు. సుబ్బులు అంట్లు కడిగి సద్దన్నం అదీ సర్దుతూ వుంది. పిల్లాడు గుమ్మం దగ్గర మంచోమంటం చూసింది. సూపరేజరు భార్య నడిగి రేసన కార్డులు తీసుకుంది. సుబ్బరాయుడిగారివీ, గోవిందుగారివీ ముందే వుంచింది. ఆ మూడు రేషను కార్డులు మునిరాముడికిస్తూ— బోకులు కడిగినా. పంచె ఉతికి వస్తా. నువ్ టోరు దగ్గరుండరా అబ్బీ అంది.

ఎన్ని కొండబోవాల, లెక్క యి? మునిరాముడి ప్రశ్న.

ఏం తొందర. సక్కెర, గోదుమల్ తనీ తనీగా సేసుకో. మంటిమానె డబ్బీలో బేయించుకో, మన వంతుకి డబ్బీలు పెట్టిన్నా, జాస్తి మంది వుందారంట. బద్రంబ్బీ, లెక్క అందూపోతే సస్తాం. జాగర్త' సుబ్బులు జాగర్తలు చెప్పింది.

సరే వస్తా... అంటూనే మునిరాముడు వెళ్లకుండా దేనికో ఎదురుచూశాడు.

'మాగట్టా యియ్యంది ఎల్లబారనా' అంటూ వాడి చేతిలో ఓ గట్టా పెట్టింది.

మునిరాముడు ఎడమ చేతితో మాగుండ నోటిలో పెట్టుకొని దుకాణం వేపు దారి తీశాడు. దారిలో మునిరాముడు ఆలోచిస్తున్నాడు.

వాడి ప్రపంచం చౌక ధరల దుకాణమూ, కొట్టమూ, బడీ ఈ మూడే. బడిలో చదువుతున్నంత సేపూ వాడి పంచ ప్రాణాలూ చౌక ధరల దుకాణం పైనే ఉంటాయ్. నాలుగో తరగతిలో పడ్డాడు. అయితే ప్రపంచం ఏమిటో బాగ బోధపడుతూ వుంది. అమ్మ మాట వాడు పిడుగు పడినా వదలడు.


మూడు నాలుగేళ్ల కిందట సూపరేజరు కొడుకు కాన్వెంటు కెళ్ళేది చూశాడు—

"యమా, నాకూ ఆ—లంగీ బెల్టూ, ఆ రంగు తాడూ (టై) కావాల్నే. నానూ ఆ యబ్బితో యిస్కూలుకు పోతా' అని అమ్మనడిగాడు.

సుబ్బులు తల్లిగా ఏం సమాధానం చెప్తుంది?

అబ్బీ ముందీ బళ్లో సదవరా, పెద్దయినాక అంపుతా.' మునిరాముడు పలుకలేదు అమ్మ మాటలకి.

'అయ్యనేదు. తాత ముసలోడయిండు. అమ్మకి




పెద్ద నౌకరీ నేదు అనుకున్నాడు......

పనిలో సూపరేజరింట్లో సుబ్బులు కొత్తగా చేరిన రోజు. ఓ రోజు మునిరాముడికి బాగా ఆకలేసింది. వాళ్లమ్మతో వెళ్లిన వీడు సమయం చూసి వంట గదిలో కెళ్లి చపాతి తీసుకున్నాడు. సుబ్బులు అది చూసి దుఃఖం కడుపులో దాచుకొని వాణ్ని మందలించింది—

"దొంగసనులు సేత్తే జైలుకు పోతవు. అడిగితే పెడ్తరు. వాళ్లిస్తేనే కొండ బోవాల" అని.

అంతక ముందు స్కూలు వద్ద పిల్లల్ని తింటుంటే పెట్టమని అడిగాడు. పెట్టకపోగా యీసడించుకున్నారు.

అప్పుడు అమ్మ మాటలు గుర్తు తెచ్చుకున్నాడు.

'అమ్మమాట యినకుంటే యిబ్బందౌద్ది. అచ్చమ్మ వాళ్లబ్బి యినకుండా ముసలమ్మని కొట్టిన్నాడు. పక్కింట్లో లెక్క కొండ బోయిన్నాడు. పోలీసోళ్ల వాణ్ని కొండబోయి ఏందో పెద్ద యిస్కూల్లో సదవేస్తుం డారు.'

అందుకే తను ఎవ్వర్నీ అడగడు. అమ్మ పాచిపని చేసె యిళ్ళల్లో పిల్లలు ఊరిస్తూ తింటున్నా, చూడనట్టు ఉంటాడు.

మునిరాముడు తనంత తాను తన స్నేహితుల కన్నా గొప్ప అనుకుంటున్నాడు—

'మూడో తరగతిసదివి నర్సింలు బైండింగు పనికి పోతుండౌడు. ఎంకటేసు బస్సులో క్లీనరయినాడు. చిన్నప్ప జిన్నింగు మిసను పనికి పోతూండాడు. నాను నయం గదా. బడికి పోతుండా. సరుకులు తెస్తుండా. అమ్మమాట యింటుండా.'

బియ్యాలు తెస్తే లెక్కలు (డబ్బులు) దండిగా వస్తాయ్, అంగీలు పట్టిస్తా. ఇంకా పెద్దవుతా. ఎని మిత్తరవుతులు సదువుతా... ఉద్దాగం సంపాయిస్తా. మంచి పేరు తెచ్చుకుంటా. అబ్బన్నా...... సూస్తాం... యీ రెండుదినాలు పటాకాలుకాలుస్తా...

తన భవిష్యత్తు గురించి కలలు కంటూన్న ముని రాముడు "ఏంబ్బీ, యింగా యిక్కడే వుండావ్" అనే అచ్చమ్మ పిలుపుతో ఉలికిపడి యీలోకం లోకి వచ్చాడు. పైన చూశాడు. మబ్బులు కమ్మినయి. వాన వచ్చే సూచన్లు కనిపించగానే పరుగులాంటి నడకను పెంచాడు.

* * * *

ఆడవాండ్లూ, పిల్లలూ, నేను ముందంటే నేను ముందు అని సంచీలు, డబ్బాలు పట్టుకొని నిల్చున్నారు.

"బెయ్, మూడు కిలోల సకెర, ఊ ... కొండబో ... యిడ్సూ...కానీయ్..." దుకాణం వాడు తొందర పెడ్తున్నాడు.

"కాస్సేపు ఉండరా అబ్బీ, ఏం, నువ్ మీందికి వస్తుండావ్?" అని ఆడవాళ్లు తొందర పెడ్తున్నారు.

"అబ్బన్నా, ఏం దొబ్బు తారండ్రా" అని పిల్ల వాళ్ళు ఫిర్యాదు చేస్తున్నారు.

"నేనుముందొచ్చినా నబ్బీ లెక్కలు తీసుకో" అని ముసలాళ్ళుతొందర చేస్తున్నారు. అంతా హడావిడిగా వుంది. మునిరాముడు తన డబ్బాల దగ్గరకెళ్ళాడు. ఎప్పుడూ లేని రద్దీ పెరగడంతో గంటలో అందరికీ పంచడం కష్టం అనీ, క్యూని కంట్రోలు చేయడం తన చేత గాదనీ దుకాణం వాడు కంగారు పడుతున్నాడు.

ఆకాశంలో మబ్బులు దట్టంగా మరింత నల్లగా కన్పిస్తున్నాయి. చల్లగాలితో పాటు జల్లు ప్రారంభమైంది. దానితో జల్లులాంటి అలజడి ఆడవాండ్లలో మొదలైంది. పది నిముషాల్లో అంగడి కట్టేస్తాడు దుకాణం వాడు.

మునిరాముడు మూడు కార్డులు పట్టుకొని, డబ్బాల్తో, సంచుల్తో వరసలో నిల్చున్నాడు. వాడి వద్ద అన్ని కార్డులు చూసి ప్రక్క వాండ్లు ఓర్చుకోలేక పోయారు.

"నువ్వుండబ్బీ" వాణ్ని ప్రక్కకు నెట్టారు కొందరు.

"నువ్వూర్కో, లాడు పడుతుండవ్, ఆ యబ్బి నీకన్నా ముందొచ్చి డబ్బీ పెట్టిన్నాడు." ప్రక్కావిడ అంది.

"అబ్బన్నా, సస్పింపో, ఏం, మీంద మీంద పడ్తుండావ్," ఇంకో ఆవిడ విసుగ్గా అంది.

ఒకర్నొకరు నెట్టుకుంటున్నారు. గందరగోళంగా వుంది. ఆకాశాన మబ్బులు ఒకదాన్నొకటి రాసుకుంటు న్నాయి. ఒకటే అలజడి. మునిరాముడు మూడు సంచులు నింపుకున్నాడు. వెనుకవాళ్ళు నెట్టుతూనే వున్నారు.

మునిరాముడు సందు చేసుకొని వంగి వంగి నడు స్తున్నాడు. కాళ్ళనూ, చేతుల్నీ త్రోసుకుంటూ గుంపులో చిక్కాడు.

దుకాణం వాడు అల్లరిని చూసి ఓ తలుపు మూశాడు. ఆడవాళ్ళ చేతులు కలిశాయి. సంచులు, డబ్బాల శబ్దం. ఈ రణగొణ ధ్వనికి పల్లవిగా ముందే ప్రారంభమైన జల్లు ఎక్కువైంది. పరిస్థితి చేజారి పోతుందన్న దుకాణం వాడు పోలీసుకు అర్జంటు కబురుపెట్టాడు. పోలీసులు రంగంలోకి దిగారు. ఇద్దరి ముగ్గురిపైన లాఠీ విసిరారు. గుంపులో త్రొక్కిసలాట ఎక్కువైంది. మునిరాముడు కాలు జారి జనం కాళ్ల క్రింద పడ్డాడు.